సాక్షి
నంద్యాల
బుధవారం ❘ 6 ❘ ఆగస్టు ❘ 2025



డిగ్రీ అడ్మిషన్లు ఇంకెప్పుడు?

ఇంటర్ ఫలితాలు వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా డిగ్రీ కళాశాలల్లో ప్రవేశ ప్రక్రియ ప్రారంభం కాలేదు. నేటికీ నోటిఫికేషన్ విడుదల కాకపోవడంతో విద్యార్థులుఆందోళన చెందుతున్నారు. 10లో▸



మాతృత్వం.. దూరం

సృష్టిలో ప్రతి స్త్రీ తను ఒక బిడ్డకైనా జన్మనిచ్చి అమ్మకావాలని భావిస్తుంది. కానీ ఈ వరం ఇప్పుడు కొందరికి ఆలస్యంగా, మరికొందరికి అసలు కావడం లేదు. 10లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,626.06
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:24,116
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:23,655

న్యూస్‌రీల్

భ్రామరీ సమేత మల్లన్నకు ఊయల, పల్లకీ సేవ



స్వామిఅమ్మవార్లకు ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో లోక కల్యాణం కోసం మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. మంగళవారం శ్రీస్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. ముందుగా లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించి, మహా గణపతిపూజ జరిపించారు. అనంతరం శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు. అలాగే ఊయలలో స్వామి అమ్మవార్లను ఉంచి షోడశోపచార పూజలు నిర్వహించారు.

తిరుమల అన్నదాన ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



ఈఓకు చెక్కును అందజేస్తున్న నాగరాజు దంపతులు

కోవెలకుంట్ల: తిరుమల తిరుపతి దేవస్థానం అన్నదాన ట్రస్టుకు కోవెలకుంట్లకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మంగళవారం విరాళం అందజేశారు. నిత్యాన్నదాన ట్రస్టుకు తమ వంతు సాయంగా ఉపాధ్యాయుడు నాగరాజు, వరలక్ష్మి దంపతులు రూ.10 లక్షల చెక్కును టీటీడీ ఏడీఎల్ ఈఓ వెంకయ్య చౌదరికి అందజేసి ఔదార్యం చాటుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో రెండు పర్యాయాలు రూ.10 లక్షల చొప్పున అన్నదాన ట్రస్టుకు విరాళం అందించినట్లు తెలిపారు.

సమస్యలపై బుగ్గన ఆరా



ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి బుగ్గన

బేతంచెర్ల: ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, రైతులు ఎదుర్కొంటున్న కష్టాలు తదితర విషయాలపై మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, నాయకులు ముర్తుజావలి, ఖాజా గూని నాగరాజు, రామచంద్రుడు, మురళీ కృష్ణ, పిట్టల జాకీర్, తిరుమలేశ్వర్ రెడ్డి, వెంకి రెడ్డి, నారాయణ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలన తీరుపై చర్చించారు. ముఖ్యంగా రైతులకు విత్తనాలు, ఎరువులు అందుతున్నాయా? వ్యవసాయ దిగుబడులకు మద్దతు ధర లభిస్తుందా? అని రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డోన్ పట్టణంలో బుధవారం జరిగే తన తనయుడు బుగ్గన అర్జున్‌రెడ్డి వివాహ రిసెప్షన్ వద్దకు వచ్చే ప్రజలు, నాయకులు, కార్యకర్తలు జాగ్రత్తగా చేరుకోవాలని సూచించారు.


రైతు కంట్లో కారం
బీమా అయోమయం



లోనింగ్ పెంచుకోవడంపైనే బ్యాంకర్ల దృష్టి

- స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఎక్కువున్న పంటలకే రుణాలు
- బ్యాంకులో ఒక పంట.. ఈ క్రాప్‌లో మరో పంట
- అధిక శాతం మిర్చి పేరిటే లోన్లు
- సాగు చేస్తున్న పంటలు కంది, సజ్జ, ఆముదం, జొన్న, కొర్ర
- అతివృష్టి, అనావృష్టి సమయంలో దక్కని బీమా
- బీమాను పట్టించుకోని 90 శాతం పైగా రైతులు

కర్నూలు(అగ్రికల్చర్): గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం (2019–20 నుంచి 2023–24)లో ఎలాంటి షరతులు లేకుండా నోటిపై చేసిన పంటలు ఈ–క్రాప్‌లో నమోదైతే చాలు బీమా వర్తించింది. ఈ ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే. నేడు రైతుల ఆశలను ఇటు కూటమి ప్రభుత్వం.. అటు బ్యాంకులు దెబ్బతీస్తున్నాయి. ఉచిత పంట బీమాకు కూటమి ప్రభుత్వం తిలోదకాలు ఇవ్వడంతోనే రైతులకు కష్టాలు చుట్టుముట్టాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఉచిత పంటల బీమాకు స్వస్తి పలికి ప్రీమియం చెల్లించి బీమా పొందే విధానాన్ని అమలులోకి తీసుకరావడంతోనే 90 శాతం పైగా రైతులు పంటల బీమాకు దూరమయ్యారు. కొంతమంది రైతులు బీమా కోసం ప్రీమియం చెల్లించేందుకు ముందుకొచ్చినా సర్వర్ పనిచేయకపోవడంతో నిరాశతో వెనుతిరిగే పరిస్థితి ఏర్పడింది. బ్యాంకుల నుంచి పంట రుణాలు పొందిన కొందరు రైతులు ప్రీమియం చెల్లించినప్పటికీ బీమాను కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. రైతుల అమాయకత్వం, లోనింగ్‌ను పెంచుకోవాలనే తపనతో బ్యాంకులు రైతులను బీమాకు దూరం చేస్తున్నాయి.



స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఎక్కువ ఉన్న పంటలకే రుణాలు

బ్యాంకులు లోనింగ్ పెంచుకునేందుకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్(రుణ పరిమితి) ఎక్కువ ఉన్న పంటలకే రుణాలు ఇస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా వర్షాధారం కింద సాధారణంగా కంది, సజ్జ, జొన్న, కొర్ర, ఆముదం వంటి పంటలు సాగు చేస్తున్నారు. ఈ పంటలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ తక్కువ. రైతులు ఏ పంట వేశారు.. ఏ పంట వేస్తున్నారో పక్కాగా తెలుసుకొని ఆ పంటకు మాత్రమే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణం ఇవ్వాలి. కానీ ఏ బ్యాంకు కూడా వాస్తవంగా సాగు చేసిన పంటలకు రుణాలు ఇవ్వని పరిస్థితి. సాగు చేయని పంటలకు రుణాలు ఇస్తున్నాయి. ఎండు మిర్చికి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఎక్కువ. ఈ పంటకు ఎకరాకు రూ.1.15 లక్షల నుంచి రూ.1.25 లక్షల వరకు ఉంది. బ్యాంకులు లోనింగ్‌ను పెంచుకునేందుకు ఎండుమిర్చి పంట పేరుతో పంట రుణాలు ఇస్తున్నాయి. రైతులు కూడా ఎక్కువ మొత్తంలో లోన్ వచ్చిందని తాత్కాలికంగా సంతోషపడుతున్నారు. పంటల బీమా సాయం దక్కనప్పుడు ఏ స్థాయిలో నష్టపోతున్నారో ఊహించలేక పోతున్నారు.

బీమా చేసుకున్న రైతులు 26,955 మందే!

కర్నూలు జిల్లాలో 3.75 లక్షల మంది రైతులుండగా జూలై నెల 31 నాటికి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద 11,438 మంది రైతులు మాత్రమే ప్రీమియం చెల్లించారు. నంద్యాల జిల్లాలో 3.25 లక్షల మంది రైతులు ఉండగా 220 మంది మాత్రమే ప్రీమి యం చెల్లించడం గమనార్హం. వాతావరణ ఆధారిత బీమా కింద కర్నూలు జిల్లాలో 11,056, నంద్యాల జిల్లాలో 4,241 మంది రైతులు మాత్రమే ప్రీమియం చెల్లించారు. బ్యాంకుల నుంచి పంట రుణాలు తీసుకున్న వారిలో వాతావరణ ఆధారిత బీమా కోసం కర్నూలు జిల్లాలో 16,666, నంద్యాల జిల్లా నుంచి 7,156 దరఖాస్తులు వచ్చాయి. ప్రధానమంత్రి ఫసల్ బీమా కింద కర్నూలు జిల్లాలో 3,740, నంద్యాల జిల్లాలో 266 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. బ్యాంకులు రైతులకు ఇచ్చే పంట రుణంలో ప్రీమియం కట్ చేసి బీమా కంపెనీలకు బదిలీ చేస్తారు. ప్రీమియం చెల్లించిన రైతుల్లో 90 శాతం మంది రైతులు కంది, సజ్జ, కొర్ర, జొన్న పంటలే సాగు చేశారు. అయితే బ్యాంకుల్లో మాత్రం మిర్చికి పంట రుణం పొందినట్లు ఉంటుంది. ఈ పరిస్థితి దాదాపు అన్ని బ్యాంకుల్లోనూ ఉంది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.1,675 కోట్ల పరిహారం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా ఐదేళ్లలో ఒక్క రూపాయి ప్రీమియం చెల్లించకుండానే ఉమ్మడి జిల్లాలో రూ.1,675 కోట్ల బీమా పరిహారం మంజూరైంది. పంట రుణాలతో సంబంధం లేదు.. మీ సేవ కేంద్రాలు, కామన్ సర్వీస్ సెంటర్లు, బ్యాంకులకు వెళ్లి ప్రీమియం చెల్లించాల్సిన పరిస్థితి లేకపోయింది. సర్వర్ సమస్యలు లేవు. కేవలం నోటిపై చేసిన పంటలు ఈ–క్రాప్‌లో నమోదైతే చాలు బీమాకు అర్హత లభించింది. తాజా పరిస్థితులతో రైతులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలనను గుర్తు చేసుకొని తాము ఏం కోల్పోయామో చర్చించుకుంటున్నారు.

రుణం పొందిన పంటే ఈ–క్రాప్‌లో ఉండాలి



పంటల బీమా పరిహారం పొందడానికి స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయి. బీమా పరిహారం మంజూరు చేసే సమయంలో వీటిని క్షుణ్ణంగా పరిశీలిస్తారు. రైతులు సాగు చేసిన లేదా సాగు చేసే పంటకే రుణం తీసుకోవాలి. ఆ పంట విధిగా ఈ–క్రాప్‌లో నమోదు కావాలి. అప్పుడే పరిహారం లభించే అవకాశం ఉంటుంది. బ్యాంకుల్లో ఒక పంటకు రుణం తీసుకొని.. మరో పంట ఈ–క్రాప్‌లో నమోదైతే అధిక వర్షాలు, అనావృష్టి పరిస్థితుల్లో బీమా పరిహారం కోల్పోతారు. రైతులు ఏ పంట సాగు చేస్తున్నారో స్పష్టంగా తెలుసుకొని ప్రీమియం కట్ చేయాలని అన్ని బ్యాంకులకు సూచించాం.

– రామచంద్రరావు, ఎల్‌డీఎం, కర్నూలు

ఖరీఫ్ సీజన్‌లో వివిధ పంటలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఇలా ఉంది...

పంట పేరు	స్కేల్ ఆఫ్ ఫైనాన్స్(రూ..)
వరి	42,000- 46,000
జొన్న	21,000- 23,000
కంది	20,000- 24,000
కొర్ర	16,000- 19,000
సజ్జ	16,000- 22,000
మొక్కజొన్న	42,000- 45,000
ఆముదం	18,000- 20,000
పత్తి	44,000- 50,000
పచ్చి మిరప	90,000 - 95,000
ఎండుమిర్చి	1,15,000-1,25,000
వేరుశనగ	31,000 - 35,000

రైతులకు అవగాహన కల్పిస్తే ఒట్టు

- పంటల బీమా మార్గదర్శకాలపై వ్యవసాయ యంత్రాంగం రైతులకు అవగాహన కల్పించాలి.
- ఏ పంట సాగు చేస్తున్నారో అదే పంట పేరిట రుణం తీసుకోవాలి.
- అప్పుడే అధిక వర్షాలు, వర్షాభావం వల్ల పంటలు దెబ్బతింటే పరిహారం మంజూరవుతుందని తెలియజేయాలి.
- మిర్చి పేరుతో పంట రుణం తీసుకొని ఇతర పంటలు సాగు చేయడం వల్ల జరిగే నష్టాలను వివరించాలి.
- వ్యవసాయ యంత్రాంగం ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.
- బ్యాంకులు కూడా సాగు చేసే పంటలకే రుణాలు పొందే విధంగా అవగాహన కల్పించాలి.
- ఏ పంట సాగు చేస్తున్నారనే దానిని పట్టించుకోకుండా అందరికీ మిర్చి పేరు మీదనే పంట రుణాలు మంజూరు చేస్తుండటం రైతులకు శాపంగా మారుతోంది.
- విషయం తెలిసి రైతులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

సింగిల్ డెస్క్ పోర్టల్ దరఖాస్తులను పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: సింగిల్ డెస్క్ పోర్టల్ దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రమోషన్ కమిటీ, జిల్లా నైపుణ్య అభివృద్ధి కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహం కోసం రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి రాయితీ, పావలా వడ్డీ, విద్యుత్, సేల్ టాక్స్ తదితరాలలో రాయితీ ప్రయోజనాలు కల్పిస్తోందన్నారు. గత త్రైమాసిక కాలంలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతుల కోసం 139 దరఖాస్తులు రాగా సింగిల్ డెస్క్ విధానంలో ఆయా శాఖల ద్వారా 131 పరిశ్రమలకు అనుమతులు మంజూరయ్యాయన్నారు. మిగ తా 8 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయన్నారు. జిల్లాలో స్కిల్ హబ్స్, ఈఎస్‌ఈలలో జాబ్ మేళాలు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎంత మంది యువత నైపుణ్య శిక్షణను పొందుతున్నారన్న అంశాన్ని వెబ్‌సైట్‌లో కలెక్టర్ పరిశీలించి, ప్రగతి సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా 2025లో నిర్వహించే జాబ్ మేళా బ్రోచర్లను అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం ఎస్.మహబూబ్ బాషా, నైపుణ్య అభివృద్ధి శిక్షణా అధికారి శ్రీకాంత్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, పరిశ్రమల శాఖ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ రెడ్డి, ఐటీడీఏ పీఓ వెంకట శివప్రసాద్, ఎల్డీఎం రవీందర్ కుమార్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కిశోర్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు రాజమహేంద్రనాథ్ పాల్గొన్నారు.

ఫసల్ బీమా యోజనకు సర్వర్ సమస్య

కర్నూలు(అగ్రికల్చర్): ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనకు సర్వర్ సమస్య రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. గత నెల 30వ తేదీ నుంచి సర్వర్ సమస్య వేధిస్తున్నప్పటికీ పరిష్కారానికి వ్యవసాయ శాఖ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. పీఎంఎఫ్‌బీవై కింద ప్రీమియం చెల్లింపు గడువు జూలై 31తోనే ముగిసింది. అయితే సర్వర్ సమస్యతో రైతులు సద్వినియోగం చేసుకోలేదనే కారణంతో నాన్ లోనీ ఫార్మర్స్‌కు ఈ నెల 14 వరకు, లోనీ ఫార్మర్స్‌కు ఈ నెల చివరి వరకు ప్రీమియం చెల్లింపు గడువును పొడిగించింది. అయితే సర్వర్ సమస్య యథావిధిగా కొనసాగుతుండటం రైతులకు ఆగ్రహాన్ని తెప్పిస్తోంది. గడువు పెంచినప్పటికీ సర్వర్ సమస్య పరిష్కారం కాకపోవడంతో రైతుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఆలూరు, కల్లూరు, ఓర్వకల్, వెల్దుర్తి తదితర మండలాల్లో సర్వర్ సమస్య కారణంగా షోయింగ్ సర్టిఫికెట్ జనరేట్ కావడం లేదు. ప్రీమియం చెల్లించేందుకు కేంద్రం గడువు పెంచినప్పటికీ రైతులు ఉపయోగించుకోలేని పరిస్థితి నెలకొంది.

నేడు వైఎస్ జగన్ డోన్‌కు రాక

- మాజీ మంత్రి బుగ్గన తనయుని వివాహ రిసెప్షన్‌కు హాజరు



వివాహ రిసెప్షన్‌కు ముస్తాబైన వేదిక

డోన్: పట్టణంలో బుధవారం జరిగే రాష్ట్ర ఆర్థికశాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కుమారుడు అర్జున్ అమర్నాథ్‌రెడ్డి, మాజీ రాష్ట్రపతి దివంగత నీలం సంజీవరెడ్డి ముని మనవరాలు అనన్యరెడ్డి వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్నారు. తాడేపల్లిలోని హెలిపాడ్ నుంచి హెలికాప్టర్‌లో ఉదయం 9.30 గంటలకు బయలుదేరి డోన్ పట్టణ శివారులోని ఎం కన్వెన్షన్ హాల్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు 11.40 గంటలకు చేరుకోనున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో కంబాలపాడు సర్కిల్, ఉడుములపాడు మీదుగా 44వ జాతీయ రహదారిపై స్థానిక దత్తాత్రేయ స్వామి ఆలయ పరిసర ప్రాంతాల్లో నిర్మించిన వివాహ రిసెప్షన్ వేదికకు చేరుకుంటారు. వధూవరులను ఆశీర్వదించిన అనంతరం మాజీ ముఖ్యమంత్రి తిరిగి కారులో ఎం కన్వెన్షన్ హాల్ వద్దకు చేరుకుని అనంతరం హెలికాప్టర్‌లో బెంగళూరుకు 12.20కి ప్రయాణమవుతారు.




ఎం కన్వెన్షన్ హాల్ వద్ద హెలిపాడ్‌ను పరిశీలిస్తున్న మాజీ మంత్రి బుగ్గన

ఏర్పాట్ల పరిశీలన..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఎం కన్వెన్షన్ హాల్ వద్ద నిర్మించిన హెలిపాడ్‌తో పాటు దత్తాత్రేయ స్వామి గుడి ఆవరణలో నిర్మించిన వివాహ రిసెప్షన్ వేదిక, భోజనశాల షెడ్లను మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. సుమారు 40 వేల మంది ప్రజలకు వివాహ విందు ఏర్పాటు చేసినట్లు కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. మాజీ మంత్రి వెంట పట్టణ, రూరల్ సీఐలు ఇంతియాజ్ బాషా, రాకేష్, ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డితో పాటు పార్టీ నాయకులు ఉన్నారు.

కూటమి ప్రభుత్వం విఫలం

నంద్యాల(న్యూటౌన్): ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్ప విమర్శించారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ అధ్యక్షతన 'రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం' అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చిన్న నీటి పారుదల శాఖ కార్యాలయ ఆవరణలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.35 వేల కోట్లు ప్రభుత్వం ఉద్యోగులకు బకాయి ఉందన్నారు. జిల్లా, మండల కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను ఇళ్ల స్థలాలుగా ఉద్యోగులకు ఇచ్చి బకాయిలను చెల్లించాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి సుధాకర్, శ్రీనివాసులు, తిరుపాలు, ఫక్రుద్దీన్, సునిల్‌కుమార్, విజయలక్ష్మి, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగేంద్రప్ప

పరిశ్రమలు ఎక్కడ బాబూ..!

- తంగడంచ ఎంఎస్ఎంఈ పార్క్ వెలవెల
- పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన కల్పించని ఏపీఐఐసీ అధికారులు
- తొమ్మిదేళ్లల్లో ఒక్క పరిశ్రమ రాని వైనం
- ఎంఎస్ఎంఈ స్థలాలు నిరుపయోగం

జూపాడుబంగ్లా: పరిశ్రమలతో కళకళలాడాల్సిన భూములు వెలవెలబోతున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో తంగడంచ ఎంఎస్ఎంఈ పార్క్ చిన్నబోయింది. తొమ్మిదేళ్లు అయినా ఒక్క పరిశ్రమను స్థాపించటానికి పారిశ్రామికవేత్తలు ముందుకు రాలేదంటే అధికారుల నిర్లక్ష్యం ఏపాటిదో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. తండగంచ గ్రామ సమీపంలో కేజీ రోడ్డు నుంచి 1.25 కిలోమీటర్ల దూరంలో ఎంఎస్ఎంఈ పార్కు ఉన్నా అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. 2016లో దాదాపు 211 ఎకరాల తంగడంచ ఫారం భూములను అప్పట్లో సీఎం చంద్రబాబునాయుడు గుజరాత్ అంబుజా పరిశ్రమకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. పరిశ్రమ స్థాపన నిమిత్తం కర్నూలు–గుంటూరు రోడ్డు నుంచి రూ.3.09 కోట్ల ప్రత్యేక అభివృద్ధి నిధులతో 1.25 కిలోమీటర్ల మేర రెండులైన్ల రోడ్డును నిర్మించారు. అయితే అంబుజా కంపెనీవారు కాలు పెట్టకుండానే వెనుదిరగటంతో ఆ భూములను ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్షర్ సంస్థ (ఏపీఐఐసీ)కు కేటాయిస్తూ అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీఐఐసీకి కేటాయించిన 211 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ (మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్) పార్కులో చిన్నతరహా, మధ్య తరహా పరిశ్రమలు నెలకొల్పేందుకు వీలుగా రూ.7కోట్లతో అంతర్గత బీటీరోడ్లు, డ్రైనేజీలు, త్రీఫేస్ విద్యుత్ సరఫరా నిమిత్తం విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. 211 ఎకరాల్లో 50 ఎకరాలను స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీస్ స్థాపించేందుకు ఏడు, పది సెంట్ల ప్రకారం 260 ప్లాట్లను ఏర్పాటుచేశారు. పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే వారిలో ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 5 శాతం, బీసీలకు 30 శాతం చొప్పున ప్రాధాన్యత నిస్తూ చదరపు మీటరు రూ.840 చొప్పున స్థలాన్ని కేటాయించనున్నట్లు అధికారులు వెల్లడించారు. పరిశ్రమల స్థాపనపై ఏపీఐఐసీ అధికారులు పారిశ్రామికవేత్తలకు, నిరుద్యోగులకు అవగాహన కల్పించకపోవటంతో రూ.12కోట్ల నిధులు వెచ్చించి ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కు స్థలాల్లో తొమ్మిదేళ్లు గడిచినా ఒక్క పరిశ్రమ స్థాపించకపోవటాన్ని బట్టిచూస్తే అధికారుల పనితీరు అర్థం చేసుకోవచ్చుననే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.




తొమ్మిదేళ్ల క్రితం పరిశ్రమల ఏర్పాటు కోసం అభివృద్ధి చేసిన ఎంఎస్ఎంఈ పార్కు లేఅవుట్



నేడు ముళ్లపొదలతో నిండిన ఎంఎస్ఎంఈ పార్కు స్థలాలు, రోడ్లు

అవగాహన కల్పించే వారు లేక..

పరిశ్రమల ఏర్పాటుపై ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవగాహన కల్పించడడంలో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. పరిశ్రమలు స్థాపించుకునే వారికి ఎంఎస్ఎంఈలో స్థలం కేటాయించాలంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అయితే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి సవాలక్ష ఆంక్షలు విధించటంతో కొంత మందికి అవగాహన లేకపోవడంతో మొదట్లోనే వెనుకడుగు వేస్తున్నారు. దరఖాస్తు చేసినా కొన్ని నిబంధనలతో తిరస్కారానికి గురవుతున్నాయి. ఔత్సాహికులైన పారిశ్రామిక వేత్తలకు తంగడంచ ఫారంలో పరిశ్రమలు స్థాపించే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని నిరుద్యోగులు, నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.



ఎంఎస్ఎంఈ పార్కు లేఅవుట్ చిత్రపటం

భూముల అధిక ధరలు.. ఆసక్తి చూపని పారిశ్రామికవేత్తలు

బంగారు పంటలు పండే తంగడంచ ఫారంలోని నల్లరేగడి భూములను ప్రభుత్వం నుంచి ఏపీఐఐసీ ఎకరా రూ.4.50లక్షల చొప్పున కొనుగోలు చేసింది. బహిరంగ మార్కెట్లో ఎకరా ఫారం భూమి ధర రూ.15 నుంచి రూ.20 లక్షల ఉంటుంది. ఏపీఐఐసీ మాత్రం చదరపు మీటరు రూ.840 ప్రకారం పారిశ్రామిక వేత్తలకు ఇస్తుంది. ఈ లెక్కన ఎకరా భూమి విలువ రూ.33.98 లక్షలు అవుతుంది. కొన్నదానికంటే అత్యధిక ధరకు విక్రయిస్తుండటంతో పాటు ఏడాదిలోగా పరిశ్రమను స్థాపించకపోతే ఇచ్చిన భూమిని వెనక్కితీసుకొంటామనే పలు నిబంధనలను విధించటంతో పారిశ్రామిక వేత్తలు ఆసక్తి చూపడం లేదనే విమర్శలున్నాయి.

వామ్మో.. నల్లనాగు



నల్లనాగును పట్టుకున్న స్నేక్ క్యాచర్ మోహన్

మహానంది: బుక్కాపురంలోని హుసేన్ బాషా ఇంట్లో మంగళవారం నల్లనాగు కనిపించి కలకలం సృష్టించింది. బాత్‌రూమ్‌లో సుమారు పది అడుగులకు పైగా ఉన్న నల్లనాగు కనిపించడంతో కుటుంబసభ్యులు పరుగులు తీశారు. వారు వెంటనే అయ్యన్న నగర్ గ్రామానికి చెందిన స్నేక్ క్యాచర్ మోహన్‌కు సమాచారం అందించగా ఆయన గ్రామానికి చేరుకుని పామును పట్టుకుని సమీపంలోని నల్లమల అడవిలో వదిలేశాడు.

- తగ్గిన సంతానోత్పత్తి రేటు
- కర్నూలు జిల్లాలో 1.8, నంద్యాల జిల్లాలో 1.36 రేటు
- జీవనశైలి మారడంతో తగ్గుదల
- యువతుల్లో స్థూలకాయం, పీసీఓడీ
- పురుషుల్లో తగ్గుతున్న శుక్రకణాల సంఖ్య
- 20 శాతం మందికి సంతానలేమి సమస్య

మాతృత్వం..దూరం!

కర్నూలు(హాస్పిటల్): సృష్టిలో ప్రతి స్త్రీ తను ఒక బిడ్డకైనా జన్మనిచ్చి అమ్మకావాలని భావిస్తుంది. ఈ మేరకు వివాహమైన నాటి నుంచి పరితపిస్తుంది. పుట్టిన బిడ్డ ఆమె పెంపకంలో పెరుగుతూ ఎదుగుతూ ఉంటే ఆ తల్లి పడే ఆనందానికి హద్దులు ఉండవు. కానీ ఈ వరం ఇప్పుడు అందరి తల్లులకు కలగడం లేదు. కొందరికి ఆలస్యంగా పిల్లలవుతుంటే మరికొందరికి అసలు కావడం లేదు. దంపతులిద్దరిలో లేదా ఒకరిలో లోపం ఉండటం వల్లే ఇలా జరుగుతోంది. జీవనశైలిలో వచ్చిన మార్పులే దీనికి ప్రధాన కారణమని వైద్యులు భావిస్తున్నారు. ఈ క్రమంలో సంతాన సాఫల్య కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సంతానలేమి సమస్యతో బాధపడే వారి సంఖ్య అధికమైంది. ఒకప్పుడు వందలో ఒకరిద్దరు మాత్రమే సంతానలేమితో బాధపడేవారు. ఇప్పుడు ఆ సంఖ్య పట్టణాల్లో 20 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 10 శాతం వరకు ఉంటోంది. 2023-24 సంవత్సరంలో రాష్ట్రంలో సగటు సంతానోత్పత్తి రేటు 1.21 ఉండగా ఇందులో కర్నూలు జిల్లాలో 1.80, నంద్యాల జిల్లా 1.36గా నమోదైంది. కాగా జిల్లాలోని ఆదోని, పత్తికొండ వంటి ప్రాంతాల్లో సంతానోత్పత్తి 3, 3.5 రేటు ఉండగా కర్నూలు, నంద్యాల వంటి పట్టణ ప్రాంతాల్లో మాత్రం 1.5 కంటే తక్కువగా సంతానోత్పత్తి రేటు పడిపోవడం ఆందోళనకరం.



ఇలా చేయాలి

- సమతుల ఆహారం తీసుకోవాలి. రోజూ తగినంత వ్యాయామం చేయాలి. బయటి ఆహారానికి ముఖ్యంగా జంక్‌ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి.
- స్థూలకాయం తగ్గించుకోవాలి. ఇందుకోసం జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి.
- ధూమపానం, మద్యపానం మానేయాలి.
- మానసిక ఒత్తిడి తగ్గించుకోవాలి. ఇందుకోసం యోగా, ధ్యానం చేయాలి.
- వివాహమై ఏడాది దాటినా గర్భం దాల్చకపోతే వైద్యులను కలిసి చికిత్స తీసుకోవాలి.

పెరిగిన సంతాన సాఫల్య కేంద్రాలు

పిల్లలు కలగని దంపతులు ఒకప్పుడు సమీప గైనకాలజిస్టులను కలిసి చికిత్స తీసుకునేవారు. అప్పటికీ పిల్లలు కలగకపోతే మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి నగరాలకు వెళ్లి సంతాన సాఫల్య కేంద్రాల్లోని వైద్యులను సంప్రదించేవారు. వీరి డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని సిటీల్లో ని సంతాన సాఫల్య కేంద్రాలు పట్టణాల్లోనూ ఏర్పాటవుతున్నాయి. ఈ కారణంగా కర్నూలు, నంద్యాల, ఆదోని వంటి ప్రాంతాల్లోనూ సంతాన సాఫల్య కేంద్రాలు వెలిశాయి. కర్నూలు జిల్లాలోనే వైద్య ఆరోగ్యశాఖ వద్ద రిజిస్టర్ అయిన సంతాన సాఫల్య కేంద్రాలు 16 ఉన్నాయి. ఆయా కేంద్రాలకు ప్రస్తుతం ప్రతిరోజూ 50 నుంచి 60 మంది దాకా దంపతులు చికిత్స కోసం వెళ్తున్నారు. కాగా కొన్ని కేంద్రాలు వీరి ఇబ్బందులను ఆసరాగా తీసుకుని అధిక మొత్తంలో డబ్బు డిమాండ్ చేస్తున్నారు. వెళ్లిన ప్రతిసారి రూ.4వేల నుంచి రూ.5వేలు ఖర్చు అయ్యేలా చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కొన్ని కేంద్రాలు సంతానం కలగకపోవడానికి గల కారణాన్ని బట్టి గంపగుత్తగా రూ.1లక్ష నుంచి రూ.3లక్షల వరకు వసూలు చేస్తున్నాయి.

సంతానలేమికి కారణాలు

ఇటీవల కాలంలో చాలా మంది యువతీయువకులు జీవితంలో స్థిరపడ్డాక వివాహం చేసుకుంటున్నారు. దీనికితోడు చదువుకున్న అమ్మాయిలు అధికం కావడం, వారికి సరిపడా అబ్బాయిలు లభించకపోవడం, అమ్మాయిల సంఖ్య తగ్గిపోవడం వంటి కారణాల వల్ల ఆలస్యంగా వివాహం చేసుకోవడం, మారిన జీవనశైలి, వ్యాయామం లేకపోవడం, స్థూలకాయం, స్త్రీలలో పీసీఓఎస్ (అండాశయంలో తిత్తులు), ఎండోమెట్రియాసిస్ సమస్యలు, రాత్రివేళల్లో ఆలస్యంగా నిద్రపోవడం ,జంక్‌ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం, మొబైల్ ఫోన్ స్క్రీన్ ఎక్కువగా చూడటం వల్ల, అన్యోన్య దాంపత్యం లేకపోవడం వల్ల సంతానలేమికి కారణాలు. అయితే గ్రామాల్లో ఇప్పటికీ త్వరగా వివాహాలు కావడం, చిన్న వయస్సులోనే పిల్లలు అవుతున్నారు. ఈ కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో సంతానోత్పత్తి రేటు ఎక్కువ కనిపిస్తోంది. పట్టణాల్లో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంటోందని వైద్యులు చెబుతున్నారు.

జీవనశైలిలో మార్పులే కారణం



జీవనశైలిలో వచ్చిన మార్పులే సంతానోత్పత్తి రేటు తగ్గడానికి కారణం. ఇది పురుషుల్లో 30 శాతం, మహిళల్లో 30 శాతం ఉంది. పురుషుల్లో వీర్యకణాల సంఖ్య తక్కువగా ఉండటం, మహిళల్లో ఇన్‌ఫెక్షన్లు, పీసీఓఎస్, స్థూలకాయం, మానసిక ఒత్తిడి కారణాలు. పట్టణాల్లో ఆలస్యంగా వివాహం చేసుకోవడం, ఆలస్యంగా పిల్లలను కనాలనే ప్రణాళిక వేసుకోవడం కూడా సంతానోత్పత్తి రేటు తగ్గడానికి మరో కారణం.

–డాక్టర్ ఎస్.సావిత్రి, హెచ్ఓడీ, గైనకాలజీ విభాగం, జీజీహెచ్, కర్నూలు

తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలి



సంతాన సాఫల్య కేంద్రాలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా వైద్య ఆరోగ్యశాఖలో రిజిస్టర్ చేసుకోవాలి. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు మాత్రమే వాటిని నిర్వహించాలి. రిజిస్ట్రేషన్ చేయకుండా ఏఆర్‌టీ కేంద్రాలు నిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాము. జిల్లాలో గతంలో కంటే ఇప్పుడు సంతాన సాఫల్య కేంద్రాలు పెరిగాయి. సంతానోత్పత్తి రేటు తగ్గడమూ దీనికి ఒక కారణం కావచ్చు.

–డాక్టర్ పి.శాంతికళ, డీఎంహెచ్ఓ, కర్నూలు

విద్యుదాఘాతంతో వలస కార్మికుడి మృతి



సంతోష్ (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని చెన్నాపురం గ్రామం సమీపంలోని స్టోన్ క్రషర్ మిషన్ ఫ్యాక్టరీ దగ్గర మంగళవారం ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురై సంతోష్ (22) అనే యువకుడు మృతి చెందాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఈ యువకుడు కొన్ని రోజుల క్రితం తమ ప్రాంతానికి చెందిన మేస్త్రీ ద్వారా చెన్నాపురం స్టోన్ క్రషింగ్ మిషన్ ఫ్యాక్టరీలో పనిలో చేరాడు. రోజు మాదిరిగానే ఉదయం ఫ్యాక్టరీ దగ్గర వెల్డింగ్ వర్క్ చేస్తున్నారు. అయితే, ఆ సమయంలో వర్షం రావడంతో షార్ట్ సర్క్యూట్‌కు గురై కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి కార్మికులు సంతోష్‌ను చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీస్‌స్టేషన్ ట్రైనీ ఎస్‌ఐ మల్లికార్జున ప్రభుత్వాసుపత్రికి వెళ్లి ప్రమాదం జరిగిన తీరును, మృతదేహాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యులకు ప్రమాదం విషయం తెలియజేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు విలేకరులకు తెలిపారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న గనిమల్లేశ్వరి

జూపాడుబంగ్లా: కుటుంబ కలహాలతో మండలంలోని తర్తూరు గ్రామంలో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల మేరకు.. సి.బెళగల్‌కు చెందిన గనిమల్లేశ్వరి (23)కి తర్తూరు గ్రామానికి చెందిన మధు అనే వ్యక్తితో 18 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కొడుకు, కుమార్తె సంతానం. భర్త మతిస్థిమితం లేకపోవటం, మామ వెంకటేశ్వర్లు దివ్యాంగుడు కావడంతో కుటుంబపోషణ భారమంతా గనిమల్లేశ్వరిపై పడింది. ఈ క్రమంలో కుటుంబ సభ్యుల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె మంగళవారం పురుగుమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారు చికిత్స నిమిత్తం నందికొట్కూరుకు తరలించగా అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న మృతురాలి తల్లిదండ్రులు గ్రామానికి చేరుకొని బోరున విలపించారు. మల్లేశ్వరి మృతికి భర్త, మామే కారణమని వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మెట్లపై నుంచి జారి లారీ డ్రైవర్ మృతి



మృతుడు సానె దుశ్యంత్ కుమార్

బేతంచెర్ల: పట్టణంలోని బైటిపేట కాలనీకి చెందిన ఓ లారీ డ్రైవర్ మెట్లపై నుంచి జారీ పడి మృతి చెందాడు. హెడ్ కానిస్టేబుల్ చంద్ర శేఖర్ వివరాల మేరకు.. సానె దుశ్యంత్ కుమార్ (33) సోమవారం ఇంటి పైనుంచి కిందికి వచ్చే క్రమంలో మెట్లు దిగుతుండగా ప్రమాదవశాత్తూ జారి పడ్డాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం నంద్యాల శాంతిరామ్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్ర శేఖర్ మంగళవారం వెల్లడించారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

కర్నూలు (రూరల్): కారు అతివేగంతో డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వివరాలు.. హైదరాబాదుకు చెందిన సోదరులు శివ, మంజునాథ్, శివ సతీమణి, కూతురుతో కలిసి బెంగళూరులో గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై తిరుగు పయనమయ్యారు. సోమవారం అర్ధరాత్రి పంచలింగాల సమీపాన శివ కారును వేగంగా నడపడంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో పక్కన కూర్చున్న సోదరుడు మంజునాథ్ (42) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో శివ, ఆయన భార్య, కూతురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు తాలూకా అర్బన్ సీఐ శ్రీధర్ తెలిపారు.

అధిక వర్షాలు ఉన్నా.. రైతులకు సుఖం లేదు!

- భవిష్యవాణి వినిపించిన వసిగేరప్పతాత భక్తుడు



పూజలందుకున్న వసిగేరప్పతాత



భవిష్య వాణి వినిపిస్తున్న వసిగేరప్పతాత భక్తుడు

హాలహర్వి: నిట్రవట్టి గ్రామంలో మంగళవారం శ్రావణ శుద్ధ దశమి వేడుకలు ఘనంగా జరిగాయి. వసిగేరప్ప తాత భక్తుడు కె.ఏజీ భవిష్యవాణి వినిపించారు. ముంగారి వర్షాలు విశేషంగా గాలి నుంచి మేఘాల ద్వారా వస్తాయని, అయినా రైతులకు సుఖం ఉండదన్నారు. హింగారి వర్షాలు ఏడు కార్తీలు ఉరుములు, మెరుపుల ద్వారా వస్తాయన్నారు. రెండు తుపాన్‌లు ఉంటాయన్నారు. తెల్ల గుర్రం, ఎర్ర గుర్రం వెనుకా ముందు పరుగులు పెడతాయని చెప్పారు. ఆరు మూడు అవుతుంది, మూడు ఆరు అవుతుందని వివరణ ఇచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో భవిష్యవాణిని వినేందుకు తరలివచ్చారు.



కర్నూలు వ్యవసాయ మార్కెట్ ధరలు
(క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్టం	గరిష్టం
వేరుశెనగ	3,000	7,169
పొద్దుతిరుగుడు	5,239	5,250
ఆముదం	5,090	5,090
వాము	2,011	13,060
ఉల్లి	1,069	1,389
ఎండుమిర్చి	4,860	6,195
శనగలు	6,511	6,511
కందులు	5,397	6,397
మొక్కజొన్న	2,401	2,401
మినుములు	5,059	7,030
కొర్రలు	2,637	3,127
సోయాచిక్కుడు	1,200	1,200
సజ్జలు	2,339	2,339

ఫోన్ నం : 08518-257204, 257661

అట్టహాసంగా బిషప్ పట్టాభిషేకం



బిషప్‌గా నియామక పత్రం అందజేస్తున్న మోడరేటర్ రూబెన్‌మార్క్



నంద్యాల పట్టణంలో బిషప్ దంపతుల ఊరేగింపు దృశ్యం

- అవినీతికి తావు లేకుండా నంద్యాల డయాసిస్ అభివృద్ధికి కృషి చేయాలి
- నూతన బిషప్ సంతోష్ ప్రసన్నరావుకు మోడరేటర్ రూబెన్‌మార్క్ పిలుపు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల డయాసిస్ బిషప్‌గా కామనూరి సంతోష్ ప్రసన్నరావు పట్టాభిషేక కార్యక్రమం మంగళవారం అట్టహాసంగా జరిగింది. హోలీక్రాస్ కెథడ్రల్ సెంటినరీ చర్చి ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి నంద్యాల డయాసిస్ పరిధిలో ఉన్న పాస్టరేట్ డీసరీ చైర్మన్లు, పాస్టర్లు, కౌన్సిల్ మెంబర్లు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా(చెన్నై) మోడరేటర్ రూబెన్ మార్క్ నూతన బిషప్ సంతోష్ ప్రసన్నరావుతో ప్రమాణ స్వీకారం చేయించి మాట్లాడారు. సంతోషరావు క్రమంగా బిషప్ స్థాయికి ఎదగడం అభినందనీయమని చెప్పారు. అవినీతికి తావు లేకుండా నంద్యాల డయాసిస్ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రమాణ స్వీకారం అనంతరం బిషప్ ప్రసన్నరావును రైల్వే స్టేషన్ సమీపంలోని ఎంఎస్ నగర్ నుంచి ఊరేగింపు నిర్వహించారు. హోలీక్రాస్ కెథడ్రల్ ఆలయ ఆవరణలో బిషప్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో బిషప్‌లు ఐజక్ వరప్రసాద్, జార్జికొర్నెలి, పద్మారావు, తిమోతి, రవీందర్, హేమచంద్రకుమార్, జయసింగ్ ప్రిన్సిప్స్ ప్రభాకరన్‌లతో పాటు డయాసిస్ వైస్ ప్రెసిడెంట్ వరప్రసాద్, డయాసిస్ సెక్రటరీ స్టాండ్లీ విలియం, సెంటినరీ చర్చి సెక్రటరీ ప్రభుదాసు, నందం ఐజక్‌తో పాటు అన్ని పాస్టరేట్ల డీసరీ చైర్మన్లు, చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా దక్షిణ ఇండియా సంఘం చెన్నై కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గంలో నడుస్తా

క్రీస్తు బోధనలు అనుసరిస్తూ ఆయన అడుగుజాడల్లో నడుస్తానని నంద్యాల డయాసిస్ అధ్యక్ష ఖండం పీఠాధిపతి(బిషప్) సంతోష్ ప్రసన్నరావు అన్నారు. ప్రమాణ స్వీకారం కార్యక్రమం తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడారు. డయాసిస్ పరిధిలో ఉన్న ఆస్తులను కాపాడుతూ, నంద్యాలలో విద్య, వైద్య సేవలకు ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు.

బెల్లందొడ్డిలో చిరుత కలకలం





బెల్లందొడ్డి గ్రామంలో పులి జాడలు పరిశీలిస్తున్న అటవీ అధికారులు, గంజహళ్లి సమీపంలో కనిపించిన చిరుత

దేవనకొండ: మండలంలోని బెల్లందొడ్డి గ్రామ పరిసరాల్లో మంగళవారం ఉదయం చిరుత కనిపించడంతో ఒక్కసారిగా వ్యవసాయ కూలీలు భయబ్రాంతులకు గురయ్యారు. వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకొని పొలాల్లో పులి అడుగులను పరిశీలించి, ప్రజలను అప్రమత్తం చేశారు. అలాగే పులిజాడ కోసం గాలింపు ప్రారంభించారు. గత రెండు, మూడు రోజుల నుంచి గోనెగండ్ల మండలం గంజహళ్లి సమీపంలో సంచరిస్తున్న చిరుతే ఇక్కడికి వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

శ్రీమఠంలో సినీనటుడు సాయికుమార్

మంత్రాలయం: మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థం మంగళవారం సినీనటుడు సాయికుమార్ విచ్చేశారు. ఆయన మఠం కారిడార్‌కు చేరుకోగా ధార్మిక అధికారి శ్రీపతి ఆచార్, సహాయ పీఆర్వో వ్యాసరాజాచార్‌లు సాంప్రదాయబద్ధంగా ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. ఆయన ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని అర్చన సహిత హారతులు పట్టా రు. అనంతరం రాఘవేంద్ర స్వామి మూలబృందావనానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు.



ఆధునిక వ్యవసాయం

ఆధునిక వ్యవసాయంలో యాంత్రీకరణ కీలక పాత్ర పోషిస్తోంది. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. కూలీల కొరతను అధిగమించడంతో పాటు పెట్టుబడి ఖర్చులు తగ్గుతున్నాయి. సంప్రదాయ పద్ధతిలో రోజుకు మూడునాలుగైదు ఎకరాలకు మందు పిచికారీ చేస్తే పెరిగిన సాంకేతికతతో సుమారు 30 నుంచి 40 ఎకరాల వరకు స్ప్రే చేస్తున్నారు. ఈ పద్ధతిలోనే మంగళవారం పగిడ్యాల మండలం ప్రాతకోట గ్రామ సమీపంలో ఓ రైతు ట్రాక్టర్‌కు స్ప్రే యంత్రాన్ని కట్టి మొక్క జొన్న పంటకు పురుగు మందు పిచికారీ చేస్తున్న దృశ్యం. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు